క్లుప్తంగా

అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలి



నగరంలో పర్యటిస్తున్న కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న కట్టడాలను తక్షణమే కూల్చివేయాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు కమిషనర్ దినేష్ కుమార్ ఆదేశించారు. మహావీర్ స్ట్రీట్, మెరక వీధి, ఇన్నీస్ పేట, గెయిల్ ఆఫీస్ వద్ద జరుగుతున్న అక్రమ నిర్మాణాలను బుధవారం ఉదయం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. నగరపాలక సంస్థ అనుమతినిచ్చిన ప్లాన్ ప్రకారం మాత్రమే నిర్మాణాలు జరగాలన్నారు. ప్లాన్‌కు తగ్గట్టుగా లేని అక్రమ కట్టడాలను కూల్చివేయడమే కాకుండా, భవన యజమానిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట సిటీ ప్లానర్ సూరజ్ కుమార్, ఇతర అధికారులు ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న డిపో మేనేజర్ షబ్నం

కడియం: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో మేనేజర్ షబ్నం అన్నారు. స్థానిక బస్టాండ్ వద్ద దుప్పలపూడి రామకృష్ణ తన తండ్రి భూలోకయ్య పేరిట ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. బాటసారులకు మజ్జిగ, ద్రాక్షరసం పంపిణీ చేశారు. ఉప సర్పంచ్ వెలుగుబంటి రఘురామ్, స్థానిక నాయకులు మోసిగంటి ప్రసాద్, చిలుకూరి ప్రభాకర్, గాది ప్రసాద్, ఇసుకపట్ల బాపిరాజు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులకు శిక్షణ



శిక్షణకు హాజరైన ప్రధానోపాధ్యాయులు

కడియం: స్కూళ్ల సామాజిక తనిఖీ శిక్షణా కార్యక్రమంపై మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎంఈవో వి.లజపతిరాయ్ అధ్యక్షతన బుధవారం ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. డైట్ వైస్ ప్రిన్సిపాల్ కె.గంగాధర్ మాస్టర్ ట్రైనీగా శిక్షణ నిచ్చారు. స్టేట్ అబ్జర్వర్ (ఎస్ఎస్‌ఏ) జె.స్నేహలత శిక్షణా కేంద్రాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయుల విధులను గురించి వివరించారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఈనెల 29వ తేదీన తమ స్కూళ్లలోల్స్ పేరెంట్స్ కమిటీలకు, విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రగతి పత్రాలను తల్లిదండ్రులకు అందజేయాలన్నారు.

29న చలో అనకాపల్లి



సమావేశంలో పాల్గొన్న బీసీ నాయకులు

ప్రకాశం నగర్: కేంద్ర ప్రభుత్వం బీసీ జనగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈనెల 29న హలో బీసీ.. చలో అనకాపల్లి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ బోను దుర్గా నరేష్ యాదవ్, మహిళా విభాగం రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ అనుసూరి పద్మలత, అధ్యక్షురాలు బర్ల సీతారత్నం తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి బీసీలు అనకాపల్లి తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో గంగుల సూర్యారావు, యువజన విభాగం రాష్ట్ర కన్వీనర్ రాయుడు రాకేష్, బూడిద శరత్ కుమార్, అనూ యాదవ్ పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే అభివృద్ధి

సీటీఆర్ఐ: రాజమహేంద్రవరం నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసింది తెలుగుదేశం పార్టీయేనని ఆ పార్టీ నగర అధ్యక్షుడు రెడ్డి మణేశ్వరరావు అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోరంపూడి ఫ్లైఓవర్ రావడానికి ముఖ్యపాత్ర పోషించింది మాజీ ఎంపీ మాగంటి మురళీ మోహన్ అని, ఎప్పుడో దాని నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు.

వీరాస్వామి సేవలు చిరస్మరణీయం



తాడాల వీరాస్వామి విగ్రహాన్ని ఆవిష్కరించిన జక్కంపూడి రాజా, చిత్రంలో చందన నాగేశ్వర్, ఆకుల వీర్రాజు, మేడపాటి షర్మిలారెడ్డి తదితరులు

- రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- బుర్రిలంకలో కాంస్య విగ్రహావిష్కరణ

కడియం: కడియం ప్రాంత నర్సరీ రంగం అభివృద్ధికి దివంగత తాడాల వీరాస్వామి (పెదకాపు) చేసిన సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని బుర్రిలంకలో పేదలకు వీరాస్వామి అందజేసిన కాలనీ వద్ద ఆయన కాంస్య విగ్రహాన్ని కాలనీ వాసులు, కుటుంబ సభ్యులు ఏర్పాటు చేశారు. ఈ విగ్రహాన్ని రూరల్ కోఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డితో కలిసి జక్కంపూడి రాజా ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో రాజా మాట్లాడుతూ సుమారు 35 ఏళ్ల పాటు నర్సరీ సంఘాన్ని నిర్వహించడంతో పాటు, దేశవ్యాప్తంగా కడియం నర్సరీల ఖ్యాతిని ఇనుమడింపజేయడంలో వీరాస్వామి కృషి ఎంతో ఉందన్నారు. తన తండ్రి, దివంగత మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు సహకారంతో అప్పటి ముఖ్యమంత్రి దివంగత రాజశేఖరరెడ్డి దృష్టికి విద్యుత్ సమస్యలను తీసుకువెళ్లి, నర్సరీలకు ఉచిత విద్యుత్‌ను సాధించడంతో వీరాస్వామి ఎంతో కష్టపడ్డారన్నారు. చందన నాగేశ్వర్, ఆకుల వీర్రాజు, ఐఎన్ఏ మాజీ అధ్యక్షుడు పల్లా సుబ్రహ్మణ్యం, కేఎన్ఏ అధ్యక్షుడు పుల్లా చంటియ్య తదితరులు వీరాస్వామి సేవలను గుర్తు చేసుకున్నారు. విగ్రహ శిల్పి వడయార్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు), శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, ఖాదీబోర్డు డైరెక్టర్ పిల్లి నిర్మల, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, జేసీఎస్ చైర్మన్ తాడాల చక్రవర్తి, ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, కడియపులంక సర్పంచ్ మార్గాని అమ్మాణి, వైఎస్సార్ సీపీ నాయకులు మద్దాల అను, సరిత, కొత్తపల్లి మూర్తి, కొత్తపల్లి వేంకటేశ్వరరావు, సంగిత వేంకటేశ్వరరావు, బోడపాటి మూర్తి, గాద రామకృష్ణ, నర్సరీ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కొత్తపల్లి నాగశివాజీ, నర్సరీ రంగ ప్రముఖులు మార్గాని సత్యనారాయణ, గంగుమళ్ళ సత్యనారాయణ, పుల్లా ఆంజనేయులు, గట్టి నరసయ్య, పుల్లా రామారావు, ఎంపీడీవో కె. రత్న కుమారి, మండపేట తహసీల్దార్ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు జనసేన జిల్లా అధ్యక్షులు కందుల దుర్గేష్, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి వీరాస్వామి విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు



అధికారులతో మాట్లాడుతున్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: నియోజకవర్గంలోని నీటి ఎద్దడి లేకుండా పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టాలని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ సూచించారు. ఆయన కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. కడియం, రూరల్ మండలాల్లో తాగునీటి సమస్యపై ఎటువంటి ఫిర్యాదులు రాకూడదన్నారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే తక్షణమే పరిష్కరిస్తానన్నారు. గ్రామాల్లో పారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డ్రైనేజీ నిర్మాణ పనులను జూన్ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. కడియపులంక అంజనేయస్వామి గుడి వర్షాలు వస్తే మునిగిపోయే పరిస్థితి ఉందని, అక్కడ డ్రైన్ నిర్మాణం రెండు రోజుల్లో ప్రారంభించేలా కాంట్రాక్టర్‌తో మాట్లాడినట్టు తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో కె.రత్న కుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్‌బాబు, ఏఈ అనిల్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం



నాగబాబుకు ఆర్థికసాయం అందజేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మధురపూడి: కోరుకొండ లక్ష్మీ నరసింహస్వామి రథోత్సవంలో గాయపడిన కాపవరానికి చెందిన నాగబాబుకు బుధవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆర్థిక సాయం అందజేశారు. సరస్వతి విద్యా సంస్థ కరస్పాండెంట్ పెనకటి గంగాధరరావు ఆధ్వర్యంలో రూ.1.68 లక్షలు, ఫోన్‌పే ద్వారా మరో రూ.35 వేలు అందించారు. ఆ సంస్థకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం నాగబాబు ఇంటికెళ్లి, పరామర్శించారు.

మహిళలకు ఉచిత మగ్గం వర్క్ శిక్షణ



పాత వీరంపాలెంలో శిక్షణకు హాజరైన మహిళలు

రంగంపేట: మండల పరిధిలోని పాత వీరంపాలెం గ్రామంలో మహిళలకు ఉచిత మగ్గం వర్క్‌పై శిక్షణ తరగతులు బుధవారం నుంచి ప్రారంభించారు. దివాన్‌చెరువుకు చెందిన డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ప్రారంభించినట్టు మేనేజింగ్ ట్రస్టీ సుంకర వీరాస్వామి తెలిపారు. ఈ సందర్భంగా వినయ్ సుంకర ఫౌండేషన్ అధినేత సుంకర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 50 మంది మహిళలు శిక్షణకు హాజరయ్యారన్నారు. తోకాడ గ్రామానికి చెందిన దుర్గాదేవి, చందు శిక్షకులుగా వ్యవహరిస్తారని చెప్పారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలాక్కియా



కరకుదురు రైతుభరోసా కేంద్రంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలాక్కియా

పెదపూడి: రాష్ట్ర ప్రభుత్వం మధ్యవర్తుల ప్రమేయం లేకుండా తీసుకొచ్చిన పారదర్శకత కోసం తీసుకొచ్చిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలాక్కియా రైతులకు సూచించారు. మండలంలో కరకుదురు, దోమాడ గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు, పెదపూడిలో రైసుమిల్లు, దోమాడలో జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో రాళ్ల ఏర్పాటు ప్రక్రియ పనులను, పలు రికార్డులను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల నుంచి రైతులకు అందుతున్న సేవలను పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎక్కడ ఎలాంటి ఇబ్బంది లేకుండా రైతులు తమ ధాన్యాన్ని విక్రయించుకోవచ్చన్నారు. నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా సమగ్ర భూసర్వే పనులు పూర్తి చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ టి.సుభాష్, ఏఓ టీవీఆర్ మణిదీప్, ఆర్ఐ ఎం.త్రివేణి, వీఆర్వోలు భాగయ్య, సునీత, గణపతి తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలను విస్మరించిన చంద్రబాబు

సీటీఆర్ఐ: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన పాలనలో మైనార్టీలను విస్మరించారని జిల్లా వక్ఫ్‌బోర్డ్ అధ్యక్షుడు మహ్మద్ ఆరిఫ్ అన్నారు. జాంపేటలోని తన కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. మైనార్టీల సంక్షేమాన్ని ఏనాడు పట్టించుకోని చంద్రబాబు నాయుడు ఎన్నికలు సమీపిస్తున్న వేళ తన సెక్యులర్ ముసుగును తొలగించి అసలు సిసలైన మతతత్వ నైజాన్ని బహిర్గతం చేసుకున్నారన్నారు. గతంలో కాంగ్రెస్‌తో చెలిమి చేసి, బీజేపీపై ఆయన తీవ్ర విమర్శలు చేశారన్నారు. ప్రస్తుతం బీజేపీతో చెలిమి చేసేందుకు పవన్ కల్యాణ్ ద్వారా ఎన్ని రాయభారాలు పంపినా బీజేపీ పెద్దలు తిరస్కరించడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో తానే స్వయంగా రంగంలోకి దిగారన్నారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలన్నీ ముఖ్యమంత్రి జగన్ పాలనలో సువర్ణ యుగాన్ని చూస్తున్నాయన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైఎస్సార్ సీపీ అఖండ విజయం సాధించడం ఖాయమన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు రక్షణ

- హైస్కూళ్లలో నైట్ వాచ్‌మెన్‌ల నియామకం
- జీవో జారీచేసిన రాష్ట్ర ప్రభుత్వం
- సంతోషం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు



శాటిలైట్‌సిటీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల పరిరక్షణకు నైట్ వాచ్‌మెన్‌లను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఉత్తర్వులు కూడా జారీ చేసింది. మే ఒకటి నుంచి వాచ్‌మెన్లు బాధ్యతలు స్వీకరించాలని ఆదేశాలు జారీ చేసింది. జెడ్పీ హైస్కూళ్లకు ఏళ్ల తరబడి నైట్‌వాచ్‌మెన్‌లు లేరు. దీంతో పలు హైస్కూళ్లలో ఎన్నోసార్లు చోరీలు జరిగాయి. ట్యాబ్‌లు, ఇతర విలువైన వస్తువులు మాయమయ్యాయి. సరస్వతీ నిలయాలైన పాఠశాల ఆవరణలు, తరగతి గదులు రాత్రిపూట మందుబాబులకు, జూదరులకు, అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయి. మద్యం మత్తులో ఆకతాయిలు ఆస్తులను, ఫర్నిచర్‌ను ధ్వంసం చేసిన సందర్భాలు చాలానే ఉన్నాయి. ఇవే కాకుండా పశువులు పాఠశాల ఆవరణలోకి చొరబడి నీడనిచ్చే మొక్కలను, పచ్చదనాన్ని ధ్వంసం చేసిన ఘటనలు చూశాం. వీటన్నింటికీ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఏళ్లతరబడి మౌనంగా భరించారు. సెలవురోజుల్లో సైతం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు హైస్కూళ్లకు వచ్చి గమనిస్తూ ఉండేవారు.

పలు సంఘటనలు

- కొంతమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది ఫిబ్రవరిలో 11 ట్యాబ్‌లు చోరీకి గురయ్యాయి.
- తొర్రేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని కంప్యూటర్ ల్యాబ్‌లలో చోరీలతో పాటు మోటార్లను సైతం అపహరించుకుపోయారు.
- శాటిలైట్ సిటీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆకతాయిలు తాగునీటి కుళాయిల ట్యాప్‌లు, మరుగుదొడ్ల తలుపులు విరగ్గొట్టేశారు. స్విచ్ బోర్డులను ధ్వంసం చేశారు.
- బొమ్మూరు జీపీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాటన్ విగ్రహాన్ని ధ్వంసం చేయడంతో పాటు ఇనుపగేట్లు, మరుగుదొడ్ల తలుపులను విరగ్గొట్టారు. కడియం మండలంలోని పలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు మందుబాబుల ఆగడాలకు, అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారుతున్నాయి.

స్థానికులకే ప్రాధాన్యం

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నైట్ వాచ్‌మెన్లను నియమిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయడంపై హెచ్‌ఎంలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నెలకు రూ.6 వేల గౌరవ వేతనంపై నియమించే వాచ్‌మెన్ పోస్టు భర్తీలో అదే హైస్కూల్లో ఆయా భర్తకు గానీ, వంటచేసే మహిళ భర్తకు గానీ తొలి ప్రాధాన్యం ఇస్తారు. లేకుంటే 60 ఏళ్లలోపు స్థానిక ఎక్స్ సర్వీస్‌మెన్, పేరెంట్స్ కమిటీ ఎంపిక చేసిన వ్యక్తిని నియమించాలని ప్రభుత్వం పేర్కొంది. ఈ షరతుల ప్రకారం హెచ్‌ఎంలు ప్రస్తుతం తమ హైస్కూళ్లకు నమ్మకంగా పనిచేసే వాచ్‌మెన్‌ను ఎంపికచేసే పనిలో నిమగ్నమయ్యారు. నియోజకవర్గంలోని రూరల్ మండలంలో 10, కడియం మండలంలో 9 హైస్కూళ్లు ఉన్నాయి.

ప్రభుత్వ నిర్ణయం సంతోషకరం



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆస్తుల పరిరక్షణకు నైట్ వాచ్‌మెన్‌లను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం చాలా సంతోషం. గతంలో పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి ఈ అంశాన్ని తీసుకువెళ్లాం. మే ఒకటి నుంచి వాచ్‌మెన్లు బాధ్యతలు స్వీకరించాలని ప్రభుత్వం ఆదేశించడాన్ని స్వాగతిస్తున్నాం.

– బి.రాజరాజేశ్వరి, శాటిలైట్‌సిటీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు

ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ హవా

కంబాలచెరువు: ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ప్రతిభ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని ఆ కళాశాల డైరెక్టర్ ప్రతిభా మూర్తి బుధవారం తెలిపారు. సీనియర్ ఎంపీసీ విభాగంలో సంగాడి విజయరాఘవేంద్ర, జవ్వాది బాలషణ్ముఖ సౌమ్య, చిట్టిబోయిన మౌనికపద్మసాయి 983, జస్విత 981 మార్కులు సాధించారన్నారు. బైపీసీ విభాగంలో ఎం.విజయలక్ష్మి 976, ఎం.శ్రీఖ్యాతి 971, సురవరపు హరిచందన 966 మార్కులు సాధించారన్నారు. జూనియర్ ఎంపీసీ విభాగంలో వి.శశిర, సీహెచ్.హర్షిత 464 మార్కులు, బైపీసీ విభాగంలో ఎం.సాహిత్య 423, ఉప్పుదుండి గణేష్ 420 మార్కులు సాధించారన్నారు. అత్యధిక మార్కులు సాధించిన వారిని అకడమిక్ హెడ్స్ శ్రీకాంత్, బాల్‌రెడ్డి, శ్రీధర్‌లు అభినందించారు.

రేపు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: వార్షిక మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం రాజమహేంద్రవరం సిటీ, రూరల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ బుధవారం తెలిపారు.

- ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ వీఎల్‌పురం, ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఏరియా, ఆల్ బ్యాంక్ కాలనీ, శ్రీనగర్, మోరంపూడి జంక్షన్, సాయినగర్, వెంకటగిరి-2, బాపూజీ నగర్, గంగిరెడ్ల కాలనీ, హనుమాన్ నగర్, గాదాలమ్మ, సాయి నగర్, ఎల్ఐసీ ఆఫీస్ ఏరియా, హుకుంపేట విలేజ్, డీమార్ట్ వెనుక, మీనాక్షి లేఅవుట్, ఎం.మార్బుల్ వెనుక ప్రాంతాల్లో అంతరాయం కలుగుతుందన్నారు.
- ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకూ చందా సత్రం, గుండువారి వీధి, సదనం, గోదావరి బండ్, వంకాయలవారి వీధి, కంభం వారి సత్రం, మెయిన్ రోడ్డు, ఉల్లితోట వీధి, టౌన్ హాల్ రోడ్డు, మెరక వీధి, టి.నగర్, అజ్జరపువారి వీధి, బారువారి వీధి, వైగ్రామ్ రోడ్డు, చల్లపల్లివారి వీధి, న్యాపతి వారి వీధి, ఇస్కాన్ టెంపుల్, గోదావరి బండ్, శివరామ కలర్ ల్యాబ్ ఏరియా, కోటిపల్లి బస్టాండ్ ఏరియాల్లో విద్యుత్ ఉండదన్నారు.

మూల్యాంకన కేంద్రం తనిఖీ



మూల్యాంకన కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ మాధవీలత

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లాలో పదో తరగతి పేపర్ల స్పాట్ వాల్యూషన్ అత్యంత పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలోని మూల్యాంకన కేంద్రాన్ని బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూల్యాంకన కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసే బాధ్యతను ఆయా జిల్లాల విద్యాశాఖాధికారులు చూడాలన్నారు. మూల్యాంకన వివరాలను జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం వివరించారు.

అన్నిరంగాల అభివృద్ధే సీఎం జగన్ లక్ష్యం

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- గాదరాడలో గడప గడపకూ..



గాదరాడలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాజా

మధురపూడి: రాష్ట్రంలో అన్నిరంగాల అభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నట్టు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం గాదరాడ గ్రామంలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు అక్కచెల్లెమ్మలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జక్కంపూడి రాజా మాట్లాడుతూ నాడు – నేడు పథకం ద్వారా పాఠశాలలను ఎంతో అభివృద్ధి చేశారన్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పించారన్నారు. అలాగే వ్యవసాయానికి సంబంధించి విత్తు నుంచి విక్రయం వరకూ రైతులకు అన్నివిధాలుగా జగన్ ప్రభుత్వం అండగా ఉంటోందన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమం సాయంత్రం వరకూ జరిగింది. ఈ సందర్భంగా సుమారు వంద గడపలకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. కార్యక్రమంలో హరిబోలు చిన బాబు, తోరాట శ్రీను, నాగ విష్ణు, శివ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

న్యాయవిజ్ఞాన సదస్సు

కంబాలచెరువు: జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ప్రాముఖ్యతను వివరించారు. న్యాయవాది, శిక్షణ పొందిన మధ్యవర్తి పి.శ్రీనివాసరావు ఆర్బిట్రేషన్ అండ్ కన్సీలియేషన్ యాక్ట్, 1996పై అవగాహన కల్పించారు. న్యాయవాది జి.కృష్ణ కపూర్ ప్రీ ఇన్స్టిట్యూషన్ మీడియేషన్ అండ్ సెటిల్మెంట్ రూల్స్ 2018ను వివరించారు. సదస్సులో రాజమహేంద్రవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవీవీ.రాజు, న్యాయవాది, శిక్షణ పొందిన మధ్యవర్తి కె.భాగ్యలక్ష్మి, న్యాయవాదులు, లా విద్యార్థులు పాల్గొన్నారు.

శరవేగంగా.. నాణ్యతగా..



వెదుళ్లపల్లి వద్ద జరుగుతున్న రోడ్డు అభివృద్ధి పనులు



ముగ్గళ్ల వద్ద నాలుగు లేన్ల రహదారి

- చురుగ్గా రాజమహేంద్రవరం – సీతానగరం రోడ్డు పనులు
- పర్యవేక్షిస్తున్న అధికారులు

సీతానగరం: రాజమహేంద్రవరం – సీతానగరం ఆర్‌అండ్‌బీ రోడ్డు నాలుగు లైన్ల విస్తరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. శిథిలమైన ఈ రోడ్డుతో గతంలో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషి ఫలితంగా నాలుగు లైన్‌ల రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. దీంతో ప్రజలకు సుఖవంతమైన ప్రయాణం అతి దగ్గరలోనే ఉంది. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఈ రోడ్డు పనులకు రూ.70 కోట్ల నిధులు తీసుకువచ్చారు. కాతేరు నుంచి సీతానగరం వరకు 18.2 కిలోమీటర్లు పొడవున నాలుగు లైన్‌ల రోడ్డుకు అంచనా విలువ రూ.70 కోట్లు కాగా, మరో రూ.35 కోట్లు అవసరమవుతాయని ముఖ్యమంత్రి జగన్‌తో చర్చించారు.

సిమెంట్ రోడ్ల పనులు

కాతేరు నుంచి సీతానగరం వరకు గ్రామాల వద్ద డ్రైనేజీలు ఏర్పాటు చేసి, సిమెంట్ రోడ్లు వేస్తారు. ఈ విధంగా సిమెంట్ రోడ్ల పరిధి 10.5 కిలోమీటర్లు ఉంటుంది. బొబ్బిల్లంక వద్ద ఒక వైపు సిమెంట్ రోడ్డు పూర్తయ్యింది. మునికూడలి, జాలిమూడి, వెదుళ్లపల్లి, ఇనుగంటివారిపేట, ముగ్గళ్లలో సిమెంట్ రోడ్డు వేయడానికి పనులు జరుగుతున్నాయి. జూలై నెలాఖరుకు ఈ రోడ్డును ఒక రూపానికి తీసుకువస్తానని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తెలిపారు.

జక్కంపూడి రాజా కృషితో..



బొబ్బిల్లంక వద్ద ఒక వైపు సిమెంట్ రోడ్డు పూర్తయ్యింది. రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీలు ఏర్పాటు చేశారు. మరో వైపు సిమెంట్ రోడ్డు వేయాలి. దాని పనులు త్వరలో ప్రారంభిస్తారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషితో ఈ రోడ్డు అభివృద్ధి జరుగుతోంది.

– బడుగు సురేంద్ర, బొబ్బిల్లంక

ముగ్గళ్లకు కొత్తందం



వర్షాకాలంలో ముగ్గళ్లలో వాహనాలు వెళ్లడానికి కష్టంగా ఉండేది. వర్షాలు తగ్గాక రోడ్డు పనులు వేగవంతంగా జరిగాయి. నాలుగు లైన్ల రోడ్డుపై వెట్‌మిక్స్ వేశారు. త్వరలో ఇక్కడ పనులు మొదలవుతాయి. రోడ్డు విస్తరణతో ముగ్గళ్ల గ్రామానికి కొత్తందం వచ్చింది.

– సాదె చంటిబాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు, ముగ్గళ్ల